ఢాకాలోని ఓ దవాఖానలో బైక్‌కు నిప్పు పెట్టిన నిరసనకారులు

బంగ్లాదేశ్‌లో మళ్లీ హింస

- 90 మందికిపైగా మృతి.. వందల మందికి గాయాలు
- రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ విద్యార్థుల సహాయ నిరాకరణ
- ప్రధాని రాజీనామాకు డిమాండ్
- ఆందోళనకారులు, అధికారపార్టీ కార్యకర్తల మధ్య ఘర్షణలు
- దేశవ్యాప్తంగా ప్రభుత్వం కర్ఫ్యూ
- అప్రమత్తంగా ఉండాలని భారత పౌరులకు ఎంబసీ అడ్వైజరీ

ఢాకా, ఆగస్టు 4: పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో మళ్లీ హింస రాజుకుంది. ఉద్యోగాల్లో రిజర్వేషన్ల విధానాన్ని వ్యతిరేకిస్తూ ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేయాలన్న ఏకైక డిమాండ్‌తో విద్యార్థులు సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టారు. దీంతో మొదటి రోజైన ఆదివారం నిరసనకారులకు, అధికార అవామీ లీగ్ మద్దతుదారులకు జరిగిన ఘర్షణల్లో 91 మంది మరణించగా, వందలాది మంది గాయపడ్డారు. మృతుల్లో పలువురు పోలీసులు కూడా ఉన్నారు. ఆందోళనకారులను అవామీ లీగ్‌తో పాటు ఛత్ర లీగ్, జుబో లీగ్ మద్దతుదారులు తీవ్రంగా ప్రతిఘటించడంతో పరస్పరం ఘర్షణలు చోటుచేసుకున్నాయి. కాగా, బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న భారత విద్యార్థులు, పౌరులు భారత హై కమిషన్‌తో టచ్‌లో ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, ప్రయాణాలు పెట్టుకోవద్దని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో తాము ఇచ్చిన ఫోన్ నంబర్లలో సంప్రదించాలని అసిస్టెంట్ హై కమిషన్ ఎక్స్‌లో విజ్ఞప్తి చేసింది. అల్లర్లు పెచ్చుమీరడంతో ఆదివారం సాయంత్రం నుంచి దేశవ్యాప్తంగా నిరవధిక కర్ఫ్యూ విధించాలని బంగ్లాదేశ్ నిర్ణయించింది. సామాజిక మాధ్యమాలను నిలిపి వేయాలని, 4జీ మొబైల్ ఇంటర్నెట్‌ను షట్‌డౌన్ చేయాలని ఆదేశించింది. కాగా, హింసాత్మక ఘటనలను దృష్టిలో పెట్టుకుని సోమవారం నుంచి బుధవారం వరకు సెలవులను ప్రకటించింది.

ప్రధానితో చర్చలకు తిరస్కరణ

ఆందోళనకారులతో చర్చలకు ప్రధాని ఆహ్వానించినా విద్యార్థులు తిరస్కరించారు. దీంతో ఆందోళన చేస్తున్న వారు విద్యార్థులు కాదు.. ఉగ్రవాదులు అంటూ ప్రధాని హసీనా తీవ్రంగా విమర్శలు చేశారు. ఆందోళనల కారణంగా ఢాకాలోని దుకాణాలు, మాల్స్ మూసివేశారు. దేశంలోని పలు చోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆందోళనకారులు కర్రలు చేతబూని ప్రైవేట్ కార్లు, అంబులెన్స్‌లు, బస్సులు, బైక్‌లు, ఇతర వాహనాలను ధ్వంసం, దగ్ధం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్లపై అధికార పార్టీ నేతల నివాసాలు, కార్యాలయాలపై దాడులకు తెగబడ్డారు. వారు దవాఖానలపై కూడా దాడులు చేయడంతో రోగులు, సిబ్బంది తీవ్ర భయాందోళన చెందుతున్నారు. విద్యాశాఖ మంత్రి, సిటీ మేయర్ గృహాలపై కూడా విరుచుకుపడ్డారు. పలు భవనాలను ధ్వంసం చేయడమే కాక పోలీస్ వాహనాలను దగ్ధం చేశారు. సోమవారం భారీ ప్రదర్శన, సామూహిక బైఠాయింపు జరుపుతామని ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న నహీద్ ఇస్లామ్ ప్రకటించారు.

హసీనా

రాడార్ ట్రాక్ చేయలేని.. రక్షణ వ్యవస్థ అడ్డుకోలేని..!

- పక్కా వ్యూహంతో హమాస్ చీఫ్ హనియా హతం
- ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ సీక్రెట్ ఆపరేషన్
- సరిహద్దు ఆవలి నుంచి హైపర్‌సానిక్ క్షిపణి ప్రయోగం

టెహ్రాన్: హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్య నేపథ్యంలో ఇజ్రాయెల్ నిఘా సంస్థ 'మొస్సాద్' పేరు మళ్లీ చర్చల్లోకి వచ్చింది. శత్రువులను అంతమొందించేందుకు సీక్రెట్ ఆపరేషన్లు నిర్వహించడంలో ఆ సంస్థ దిట్ట. అందులో హనియా హత్య కూడా ఒకటి. ఆయన నివాసంపై పక్కా ప్లాన్‌తో రాడార్ గుర్తించలేని, గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకోలేని ఏఆర్ఆర్‌డబ్ల్యూ హైపర్‌సానిక్ క్షిపణి ద్వారా తన పని పూర్తి చేసింది. ఇది గతంలో ఆ సంస్థ చేపట్టిన 'ఏజెంట్ శ్యాడ్‌నెస్' వంటి ఆపరేషన్లను గుర్తుచేసింది. తాజా ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను మొస్సాద్ మాజీ ఏజెంట్ డార్క్ వెబ్‌లో ఉంచారు.

దాడికి హైపర్‌సానిక్ క్షిపణి ఎంపిక

ఇరాన్ కొత్త అధ్యక్షుడు పెజెష్కియాన్ ప్రమాణస్వీకారానికి హాజరుకావడంతోపాటు ఆ దేశ రక్షణ శాఖ మంత్రితో భేటీ కోసం ఖతార్ రాజధాని దోహ నుంచి ఇరాన్‌కు వెళ్లనున్న ఇస్మాయిల్ హనియాను హతమార్చాలని మొస్సాద్ ప్లాన్ వేసింది. మొస్సాద్ హెడ్ డేవిడ్ బర్నియా నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని మొస్సాద్ ఏజెంట్ యాక్టివేట్ అయ్యాడు. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థ గుర్తించలేని, సకాలంలో తిప్పికొట్టలేని విధంగా దాడి చేయడం ద్వారా హనియాను చంపాలని ప్లాన్ వేసింది. లాక్‌హెడ్ ఏఆర్ఆర్‌డబ్ల్యూ హైపర్‌సానిక్ క్షిపణిని ఎంపిక చేసుకొన్నది. దీనికి సెకనుకు మైలు దూరం ప్రయాణించే సామర్థ్యం ఉంటుంది. దీన్ని ఏ రాడార్ వ్యవస్థ గుర్తించలేదు సరికదా.. ఏ రక్షణ వ్యవస్థ అడ్డుకోలేదు. ఒక భవనాన్ని కూల్చగల వార్‌హెడ్‌ను ఈ క్షిపణి మోయగలదు.



అసలు ప్లాన్ ఏంటి?

మొస్సాద్ ఏజెంట్ టెహ్రాన్‌లోని హనియా నివాసం ముందు కారు పార్క్ చేయాలి. ఆ కారులోని ఆడియో సిస్టమ్‌లో ఒక ట్రాన్స్‌మిటర్ ఉంటుంది. హనియా ఇంట్లో నుంచి బయటకు రాగానే రిమోట్ ద్వారా ట్రాన్స్‌మిటర్‌ను యాక్టివేట్ చేయడం ద్వారా ఇరాన్ సరిహద్దుకు ఆవల ఉన్న ఇజ్రాయెల్ మిస్సైల్ బంకర్‌కు సిగ్నల్ పంపుతుంది. వెంటనే అక్కడున్న వాళ్లు క్షిపణిని ప్రయోగించాలి.

ఏ విధంగా అమలు పర్చారు?

ప్లాన్ ప్రకారం మొస్సాద్ ఏజెంట్ కారును హనియా నివాసం సమీపంలో వదిలేసి వెళ్లాడు. అయితే కారును గుర్తించిన ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ అనుమానాస్పదంగా ఏమీ గుర్తించలేదు. కొద్ది నిమిషాల తర్వాత ఇరాన్ అధ్యక్షుడు ప్రమాణ స్వీకార కార్యక్రమం నుంచి హనియా నివాసానికి తిరిగి వచ్చారు. అప్పటికే యాక్టివేట్ అయిన ట్రాన్స్‌మిటర్ నుంచి సిగ్నల్ రావడంతో హైపర్‌సానిక్ క్షిపణి గంటలకు 6 వేల కిలో మీటర్ల వేగంతో దూసుకొచ్చింది. టెహ్రాన్ చేరుకొనేందుకు 16 నిమిషాలు తీసుకొన్న ఆ మిస్సైల్.. హనియా నివాసాన్ని కూల్చివేసింది. ఆ నివాసంలో ఉన్న హనియాను ఈ విధంగా మొస్సాద్ హతం చేసింది.

యుద్ధం అంచున గల్ఫ్!

మొదటిపేజీ తరువాయి...

నడిచే హెజ్బొల్లా గ్రూపు శనివారం రాత్రి ఇజ్రాయెల్ భూభాగం వైపుగా పదుల సంఖ్యలో రాకెట్లను ప్రయోగించింది. చాలా వరకు రాకెట్లను తమ డోమ్ వ్యవస్థ అడ్డుకొన్నదని ఇజ్రాయెల్ వెల్లడించింది. కాగా, రాకెట్ దాడుల్లో మోషవ్ బీట్ హిల్లేల్‌లో పలువురు పౌరులు గాయపడినట్టు హెజ్బొల్లా గ్రూపు ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా తాము దాడులు చేపట్టామని హెజ్బొల్లా సీనియర్ మిలటరీ కమాండర్ ఒకరు తెలిపారు. మరోవైపు దక్షిణ లెబనాన్ నగరం బజౌరీహ్‌పై జరిపిన క్షిపణి దాడిలో కీలక హెజ్బొల్లా నేత అలీ అబ్ద్ హతమయ్యాడని ఇజ్రాయెల్ మిలటరీ వెల్లడించింది.

'అబ్రహం అలయన్స్' వర్సెస్ 'యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్'

ఇజ్రాయెల్, హమాస్ మధ్య జరుగుతున్న ఈ యుద్ధం 'అబ్రహం అలయన్స్ వర్సెస్ యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్'గా మారనున్నదా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ ఇటీవల అమెరికా కాంగ్రెస్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ ఇరాన్ నుంచి పశ్చిమాసియా రీజియన్‌కు ముప్పు పొంచి వున్నదని, దాన్ని తిప్పికొట్టేందుకు ఇరాన్‌కు వ్యతిరేకంగా ప్రాంతీయ దేశాలతో కూడిన 'అబ్రహం అలయన్స్' ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఇది అబ్రహం ఒప్పందానికి పొడిగింపు వంటిది. ఇరాన్ ప్రభావానికి వ్యతిరేకంగా ప్రధానంగా దాని మద్దతు గల దేశాలు, గ్రూపులతో కూడిన యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయెల్‌తో దౌత్యపరమైన సంబంధాల ద్వారా పలు దేశాలను ఐక్యం చేసేదే అబ్రహం ఒప్పందం. దీన్ని 2020, సెప్టెంబర్‌లో ప్రారంభించారు.

ఏ గ్రూపులో ఏయే దేశాలు?

అబ్రహం ఒప్పందంలో ఇజ్రాయెల్‌తోపాటుగా యూఏఈ, బహ్రెయిన్, మొరాకో, సూడాన్ ఉన్నాయి. మరోవైపు యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్ గ్రూపులో ఇరాన్, లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూపు, యెమెన్‌లోని హౌతీలు, ఇరాక్‌లోని మిలీషియాలు, గాజాలోని హమాస్, పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్, సిరియాలోని మిలిటెంట్ గ్రూపులు ఉంటాయి. 1979 ఇస్లామిక్ రెవల్యూషన్ తర్వాత ఇరాన్ తన మద్దతు గ్రూపుల నెట్‌వర్క్ ద్వారా పశ్చిమాసియాలో తన ప్రభావాన్ని క్రమంగా విస్తరించుకొన్నది. పశ్చిమాసియాలో అమెరికా ప్రభావాన్ని దెబ్బతీయడంతోపాటు అంతిమంగా ఇజ్రాయెల్‌ను నాశనం చేసేందుకు ఏర్పాటు చేసిందే ఈ యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్ గ్రూపు.

ఉద్రిక్తతలతో పలు దేశాలు అప్రమత్తం

ఉద్రిక్తతల పెరుగుదల నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా రంగంలోకి దిగింది. పశ్చిమాసియా రీజియన్‌లోని తమ సిబ్బంది, ఇజ్రాయెల్‌ను కాపాడేందుకు సైనిక మోహరింపును పెంచినట్టు అమెరికా తెలిపింది. మరోవైపు లెబనాన్‌ను వెంటనే వీడాలని అమెరికా తమ దేశ పౌరులకు సూచించింది. పశ్చిమాసియా రీజియన్‌లో పరిస్థితి వేగంగా దిగజారుతున్నదని యూకే విదేశాంగ శాఖ మంత్రి డేవిడ్ లామీ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో లెబనాన్‌ను వెంటనే వీడాలని భారత్‌తోపాటు జోర్డాన్, ఫ్రాన్స్, కెనడా వంటి దేశాలు తమ దేశ పౌరులకు అడ్వైజరీ జారీచేశాయి.

గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో దెబ్బ తిన్న స్కూల్ వద్ద అగ్నిమాపక శాఖ రెస్క్యూ ఆపరేషన్

ఇజ్రాయెల్ దాడుల్లో 18 మంది మృతి

ఉద్రిక్త పరిణామాల నడుమ గాజాపై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. ఆదివారం తెల్లవారుజామున జరిపిన దాడుల్లో 18 మంది మృతిచెందారు. మరోవైపు టెల్ అవీవ్ శివార్లలో ఓ పాలస్తీనా మిలిటెంట్ కత్తితో చేసిన దాడిలో ఇద్దరు మరణించగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇజ్రాయెల్ దాడిలో అల్ అక్సా దవాఖాన ప్రాంగణంలోని క్యాంపులో తలదాచుకొంటున్న నలుగురు మృతిచెందినట్టు గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. తాము ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకొన్నామని, ఘటనా స్థలంలో రెండో పేలుడు సంభవించడం ద్వారా అక్కడ ఆయుధాలు నిల్వ ఉన్నట్టు తేలిందని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. ఉత్తర గాజాలో ముగ్గురు చిన్నారులు సహా ఎనిమిది మంది మృతిచెందారు. డేర్ అల్ బలాహ్ సమీపంలోని ఓ ఇంటిపై జరిపిన దాడిలో ఓ బాలిక, ఆమె తల్లిదండ్రులు మరణించారు. గాజా నగరంలోని ఓ వాహనంపై జరిపిన దాడిలో మరో ముగ్గురు చనిపోయారని అధికారులు వెల్లడించారు. శనివారం గాజాలోని ఓ స్కూల్ భవనంపై చేసిన దాడిల్లో అందులో తలదాచుకొంటున్న 16 మంది మరణించగా, 21 మందికి గాయాలయ్యాయి.

బ్రిటన్‌లో వలసదారులకు వ్యతిరేకంగా నిరసనలు

87 మంది అరెస్ట్

లండన్, ఆగస్టు 4: వలసదారులకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలతో బ్రిటన్ అట్టుడుకున్నది. బ్రిటన్ దేశానికి చెందిన ముగ్గురు బాలికల మృతికి ఒక వలసదారుడే కారణమని ఆరోపిస్తూ ఇంగ్లండ్, ఉత్తర ఐర్లాండ్‌లో వలసదారుల వ్యతిరేక గ్రూపులు నిర్వహించిన ఆందోళన హింసాత్మకంగా మారింది. దీంతో పోలీసులు 87 మందికి పైగా ఆందోళనకారులను అరెస్ట్ చేశారు. గత వారం ఒక డాన్స్ స్కూల్‌లో ముగ్గురు బాలికలను ఒక వ్యక్తి కత్తితో పొడిచి హత్య చేయడంతో దేశంలోని లివర్‌పూల్, బ్రిస్టల్, హుల్, సోటక్ ఆన్ ట్రెంట్, బ్లాక్‌పూల్ సహా పలు ప్రాంతాల్లో వలస వ్యతిరేక సంస్థలకు చెందిన పలువురు ఆందోళన చేపట్టారు. దుకాణాలు, వ్యాపార సంస్థల లూటీలు చోటుచేసుకున్నాయి. ఈ కేసులో అనుమానితుడు బ్రిటన్ పౌరుడని, వలసదారుడు కాదని పోలీసులు స్పష్టం చేశారు.

రష్యాపై ఉక్రెయిన్ దాడులు

కీవ్: పరస్పర దాడులతో రష్యా, ఉక్రెయిన్ అట్టుడుకుతున్నాయి. గత 24 గంటల వ్యవధిలో రష్యాపై దీర్ఘ శ్రేణి క్షిపణి దాడులు చేశామని, ఆ దేశానికి చెందిన ఒక జలాంతర్గామిని ముంచేశామని, ఓ వైమానిక స్థావరాన్ని ధ్వంసం చేశామని ఉక్రెయిన్ సైనిక అధికారులు వెల్లడించారు. రష్యా ఆక్రమిత క్రిమియాలోని సెవెస్తోపోల్ పోర్టులో శత్రు దేశానికి చెందిన కిలో-క్లాస్ సబ్‌మెరైన్, ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ కాంప్లెక్స్‌పై దాడి చేశామని ఉక్రెయిన్ జనరల్ స్టాఫ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. రోస్టోవ్ రీజియన్‌లోని మొరోజొవ్స్క్ వైమానిక స్థావరంపై డ్రోన్ దాడి చేశామని పేర్కొన్నది.

నాకు వివాహేతర సంబంధం ఉండేది

కమలా హారిస్ భర్త డఫ్ ఎమ్‌హోఫ్ అంగీకారం

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ భర్త డఫ్ ఎమ్‌హోఫ్ తనకు గతంలో వివాహేతర సంబంధం ఉండేదని అంగీకరించారు. తన మొదటి వివాహ సమయంలో తాను వివాహేతర సంబంధం కలిగి ఉన్నట్టు చెప్పారు. అమెరికా మీడియా కథనాల ప్రకారం.. డఫ్ పిల్లలు చదువుకున్న పాఠశాలలో టీచర్‌గా పని చేసిన మహిళతో ఆయనకు వివాహేతర సంబంధం ఉండేది. ఫలితంగా ఆమె 2009లో గర్భవతి అయ్యారు. అయితే ఆమెకు గర్భస్రావం జరిగింది. వీరిద్దరి సంబంధం బయటపడటంతో డఫ్, మొదటి భార్య కెర్స్టిన్ విడిపోయారు.

యువతులతో బిల్‌గేట్స్ అనుచిత ప్రవర్తన!

తాజా పుస్తకంలో సంచలన విషయాలు

వాషింగ్టన్: సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రపంచానికి అందుబాటులోకి తెచ్చిన మేధావిగా, గొప్ప దాతగా మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ అందరికీ సుపరిచితుడు. అయితే ఆయనలో ఓ చీకటి కోణం ఉందని త్వరలో విడుదలకానున్న పుస్తకం చెబుతున్నది. ఆయన యువతులతో అనుచిత రీతిలో ప్రవర్తించేవారని, దీంతో ఆయన నుంచి యువ ఇంటర్న్స్‌ను కాపాడటం కోసం మైక్రోసాఫ్ట్ గట్టి చర్యలు చేపట్టిందని రచయిత అనుప్రీత దాస్ ఆరోపించారు. ఆయనతో ఇంటర్న్స్ ఒంటరిగా ఉండటంపై నిషేధం విధించిందని చెప్పారు. ఈ పుస్తకం ఈ నెల 13న విడుదల కాబోతున్నది.

యూపీలో పట్టాలు తప్పిన రైలు

గత 18 రోజుల్లో పదో ఘటన

న్యూఢిల్లీ, ఆగస్టు4: దేశంలో రైలు ప్రమాదాలకు అడ్డుకట్ట పడటం లేదు. తాజాగా ఉత్తరప్రదేశ్‌లో ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పింది. ఆదివారం సహ్రాన్‌పూర్ స్టేషన్ వద్ద ఢిల్లీ-సహ్రాన్‌పూర్ మెము ప్యాసింజర్ రైలు ప్రమాదానికి గురైంది. రైలులోని రెండు బోగీలు పట్టాలు తప్పాయి. గత 18 రోజుల్లో ఇది 10వ ఘటన. ప్రమాద సమయంలో రైల్లో ప్రయాణికులు ఎవ్వరూ లేకపోవటంతో, అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. సహ్రాన్‌పూర్ రైల్వే స్టేషన్ యార్డ్ పరిధిలో రైలును నావిగేటింగ్ పాయింట్ వద్దకు తీసుకెళ్తుండగా రెండు కోచ్‌లు పట్టాలు తప్పాయి.

వక్ఫ్‌బోర్డు అధికారాలకు కత్తెర

త్వరలో కేంద్రం బిల్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 4: ఆస్తులపై వక్ఫ్ బోర్డు అధికారాలకు కత్తెర వేయడానికి వక్ఫ్ చట్టంలో సవరణలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు 40 సవరణలకు క్యాబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఏదైనా ఆస్తిని 'వక్ఫ్ ఆస్తి' అని నిర్ధారించే అధికారం వక్ఫ్ బోర్డ్ యాజమాన్యానికి ఇకపై ఉండదనేది వీటిలో ముఖ్యమైన సవరణ. వక్ఫ్ బోర్డు తన ఆస్తులుగా పేర్కొనే అన్నింటిని తప్పనిసరిగా తనిఖీ చేస్తారు. కేంద్ర వక్ఫ్ మండలి, రాష్ట్రాల బోర్డుల్లో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలన్న ప్రతిపాదన కూడా తాజా సవరణల్లో ఉంది. 2013లో యూపీఏ సర్కారు ఒరిజినల్ వక్ఫ్ చట్టం-1995కు సవరణలు చేయడం ద్వారా వక్ఫ్ కేంద్ర, రాష్ట్ర బోర్డులకు ఉన్న అధికారాలను బలపరిచింది.

వక్ఫ్ బోర్డ్ అధికారాల్లో జోక్యాన్ని సహించం

వక్ఫ్ బోర్డ్‌ల చట్టబద్ధమైన హోదా, అధికారాల్లో జోక్యం చేసుకుంటే సహించబోమని 'ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్' (ఏఐఎంపీఎల్‌బీ) పేర్కొంది. ముస్లింలకు సంబంధించి వారికి ఏమీ ఇవ్వకుండా, అన్నింటినీ లాక్కునే విధంగా మోదీ నిర్ణయాలు, చర్యలు ఉన్నాయంటూ 'ఏఐఎంపీఎల్‌బీ' ప్రతినిధి ఇల్లియాస్ ఆరోపించారు.

చైనా 'డ్యామ్ బాంబ్'!

- *బ్రహ్మపుత్రపై భారీ జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణానికి సన్నాహాలు*
- *పూర్తయితే భారత్‌కు భారీ ముప్పు!*

న్యూఢిల్లీ, ఆగస్టు 4: భారత్‌పై చైనా కుయుక్తులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈసారి భారత్‌పై 'డ్యామ్ బాంబు' ప్రయోగానికి డ్రాగన్ దేశం సన్నద్ధమవుతున్నది. డ్యామ్ బాంబు అంటే డ్యామ్‌పై బాంబును ప్రయోగించడం కాదు. డ్యామ్‌నే బాంబులా మార్చి పొరుగుదేశాన్ని నిర్వీర్యం చేయడం. తాజాగా సరహద్దుకు సమీపంలో బ్రహ్మపుత్ర నదిపై భారీ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి సన్నాహాలు చేయడం ద్వారా భారత్‌ను తీవ్రంగా ఇబ్బందుల్లోకి నెట్టే ప్రయత్నాలను చైనా కొనసాగిస్తున్నదని ఆస్ట్రేలియన్ స్ట్రాటెజిక్ పాలసీ ఇనిస్టిట్యూట్ (ఏఎస్‌పీ) హెచ్చరించింది. బ్రహ్మపుత్ర నదిపై నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ పూర్తయితే అత్యంత శక్తివంతమైన జల విద్యుత్తు ప్రాజెక్టు అవుతుందని తెలిపింది. ఈ సూపర్ డ్యామ్ భారత్‌కు అన్ని విధాల ముప్పును తెస్తుందని తెలిపింది. బ్రహ్మపుత్ర నది భారత్‌లోకి ప్రవేశించే ముందు వంపు తిరుగుతుంది. అక్కడ నది 300 మీటర్ల దిగువకు లోయ వంటి ప్రాంతంలోకి నది ప్రవహిస్తుంది. అదే ప్రదేశంలో చైనా వ్యూహాత్మకంగా ఈ సూపర్ డామ్‌ను నిర్మిస్తే ఖర్చు తగ్గడమే కాక, వ్యూహాత్మకంగా పొరుగుదేశాలను కష్టాల్లోకి నెట్టవచ్చునని చైనా యోచిస్తున్నది.

ఒప్పందం మాటేమిటి?

చైనా నుంచి భారత్‌కు ప్రవహించే బ్రహ్మపుత్ర నదికి సంబంధించి ఇరు దేశాల మధ్య 2002లో తొలిసారిగా అంతర్జాతీయ ఒప్పందం కుదిరింది. తర్వాత 2008, 2013, 2018లలో ఒప్పందాలను పునరుద్ధరించుకున్నారు. ఆఖరిసారిగా చేసుకున్న ఒప్పందం 2023తో ముగిసింది. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల వల్ల దానిని పునరుద్ధరించ లేదు. ఆ ఒప్పందం ప్రకారం ఎప్పటికప్పుడు బ్రహ్మపుత్ర నదిలో నీటి మట్టం, ఎంత జలం దిగువకు ప్రవహిస్తున్నది తదితర వివరాలను భారత్‌కు చైనా తెలియజేసేది.

భారత్‌కు వచ్చే నష్టం ఏమిటి?

ఈ డ్యామ్ నిర్మాణం జరిగితే భారత్‌ను అతి వృష్టి, అనావృష్టి పరిస్థితులకు నెట్టే అవకాశాలు చైనాకు పుష్కలంగా ఉన్నాయి. మన సరిహద్దుకు కేవలం 30 కి.మీ దూరంలోని ఈ డ్యామ్ ద్వారా భారత్‌కు వచ్చే నీటిని ఆపేస్తే దిగువనున్న మన దేశానికి చెందిన అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌ల్లో తీవ్ర నీటి కొరత ఏర్పడుతుంది. తద్వారా అనావృష్టి పరిస్థితులు ఏర్పడతాయి. అలాగే వరదల సమయంలో డ్యామ్ ద్వారా హఠాత్తుగా నీటిని వదిలే 'డ్యామ్ బ్యాంబ్' ప్రయోగంతో అరుణాచల్ ప్రదేశ్, అస్సాం లాంటి రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్‌లో కూడా జల ప్రళయం సృష్టించవచ్చు. ప్రస్తుతం బ్రహ్మపుత్ర నదికి సంబంధించి ఒప్పందం లేనందున సమాచార మార్పిడి జరగదు. దీంతో అధిక నీటి విడుదలపై సమాచారం ఎందుకు ఇవ్వలేదని మనం చైనాను అడిగే అవకాశం కూడా ఉండదు. దీంతో చైనా చేసే దుష్ట పన్నాగాలను అంతర్జాతీయ వేదికలపై ఎత్తి చూపే అవకాశం కూడా భారత్‌కు ఉండదు.

కాన్వాయ్ వీడి బైక్‌పై పరారైన కేంద్రమంత్రి

బీహార్‌లోని సొంత నియోజకవర్గంలో మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు నిరసన సెగ

పాట్నా, ఆగస్టు 4: కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ గిరిరాజ్ సింగ్‌కు సొంత నియోజకవర్గమైన బీహార్‌లోని బెగుసరాయ్‌లో నిసనన సెగ తగిలింది. స్థానిక దాక్ బంగ్లా రోడ్‌లో ఆదివారం ఓ పార్క్ శంకుస్థాపనకు వచ్చిన కేంద్ర మంత్రిని ఏఎన్ఎం కార్యకర్తలు ఘెరావ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయన కారును చుట్టుముట్టి ఆందోళన చేపట్టారు. వారు తమ డిమాండ్లతో కూడిన ఒక వినతిపత్రాన్ని గిరిరాజ్ సింగ్‌కు ఇచ్చేందుకు ప్రయత్నించగా.. ఆయన వారిని పట్టించుకోకుండా, ఏం సమాధానం చెప్పకుండా నాటకీయ పరిణామాల మధ్య తన కాన్వాయ్‌ను దిగి ఆ ప్రాంతం నుంచి ఒక బైక్‌పై వెళ్లిపోయారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించాలనుకొన్నామని, అయితే కేంద్ర మంత్రి పట్టించుకోకుండా దారుణంగా వ్యవహరించారని ఏఎన్ఎం కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన సదుపాయాలు, వేతనాలు కల్పించాలన్న తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

యాపిల్ యూజర్లకు హైరిస్క్ వార్నింగ్

న్యూఢిల్లీ: ఐఫోన్లు, ఐప్యాడ్స్.. ఇతర యాపిల్ ఉత్పత్తులు వాడుతున్న యూజర్లు 'హై రిస్క్'లో ఉన్నారని హెచ్చరికలు జారీ అయ్యాయి. ఐఫోన్ సహా యాపిల్ ఉత్పత్తుల్ని సైబర్ మోసగాళ్లు లక్ష్యంగా చేసుకున్నారని, ఈ నేపథ్యంలో యాపిల్ ఉత్పత్తుల్లో భద్రతాపరమైన సమస్యలు తలెత్తవచ్చునని 'ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్' (సెర్ట్-ఇన్) తాజాగా ఓ అడ్వైజరీ జారీ చేసింది. యూజర్ల సున్నితమైన సమాచారాన్ని సైబర్ మోసగాళ్లు దొంగలించే ప్రమాదముందని హెచ్చరించింది. ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్ బుక్స్, విజన్ ప్రో హెడ్ సెట్స్‌లలో ఏ ఏ వెర్షన్ సాఫ్ట్‌వేర్‌కు ముప్పు పొంచి వుందన్నది తెలుపుతూ జాబితాను విడుదల చేసింది. ఐప్యాడ్, ఐప్యాడ్‌ల్లోని 17.6 సాఫ్ట్‌వేర్ వెర్షన్లు, 16.7.9, 14.6 మ్యాక్‌ఓఎస్ సోనోమా సాఫ్ట్‌వేర్ వెర్షన్లు, 13.6.8 మ్యాక్ ఓఎస్ వెంచురా వెర్షన్లు, 12,7,6 మ్యాక్‌ఓఎస్ మాంటెరరీ సాఫ్ట్‌వేర్ వెర్షన్లు, వాచ్‌ఓఎస్ (10.6), 17.6, విజన్‌ఓస్ (1.3) సాఫ్ట్‌వేర్ వెర్షన్లు హై-రిస్క్‌లో ఉన్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్‌ను యూజర్లు అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.

సెలబ్రిటీల మద్యం ప్రకటనలపై ఉక్కుపాదం!

న్యూఢిల్లీ: మద్యానికి సంబంధించి సెలబ్రిటీల ఎండార్స్‌మెంట్లపై ఉక్కుపాదం మోపేందుకు కేంద్రం సిద్ధమైనట్టు 'రాయిటర్స్' పేర్కొంది. దేశంలో ప్రస్తుతం మద్యం ప్రత్యక్ష ప్రకటనలపై నిషేధం ఉంది. దీంతో ఆయా కంపెనీలు బాలీవుడ్ నటులు నటించిన సరోగేట్ యాడ్స్ ద్వారా తమ బ్రాండ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి. ఆయా మద్యం బ్రాండ్లను నేరుగా ప్రచారం చేయకుండా ఆ ప్రకటన చూడగానే ఆ బ్రాండ్ మద్యం గుర్తు వచ్చేలా చేయడాన్నే సరోగేట్ యాడ్స్ అంటారు. ఇవి ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉన్నాయని కేంద్రం భావిస్తున్నది.

'లవ్ జీహాద్'కు జీవిత ఖైదు

అస్సాంలో త్వరలో చట్టం

గువాహటి : 'లవ్ జీహాద్' కేసుల్లో దోషులకు జీవిత ఖైదు విధించేందుకు వీలుగా ఓ చట్టాన్ని త్వరలో తీసుకురాబోతున్నట్లు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చెప్పారు. రాష్ట్ర బీజేపీ శాఖ కార్యనిర్వాహక సభ్యుల సమావేశంలో ఆదివారం ఆయన ఈ వివరాలను తెలిపారు. స్వస్థలానికి సంబంధించిన విధానాన్ని కూడా త్వరలో తెస్తామని చెప్పారు. దీని ప్రకారం కేవలం అస్సాంలో జన్మించినవారు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులవుతారని తెలిపారు. ఎన్నికల హామీ మేరకు కల్పించిన ఒక లక్ష ఉద్యోగాల్లో సహజసిద్ధ స్థానికులు ప్రాధాన్యం పొందారని చెప్పారు. హిందూ, ముస్లింల మధ్య భూముల అమ్మకాలకు సంబంధించిన లావాదేవీలను ప్రభుత్వం నిరోధించజాలదని, అయితే ముందుగా ముఖ్యమంత్రి సమ్మతిని పొందడం తప్పనిసరి చేశామని తెలిపారు.

2050 తర్వాత ఎప్పుడైనా

ప్రపంచం అంతం!

వాతావరణ మార్పులే కారణం

మునిచ్, ఆగస్టు 4: వాతావరణ మార్పుల వల్ల ప్రపంచం అంతం అయ్యే పరిస్థితులు ఎంతో దూరంలో లేవని పరిశోధకులు హెచ్చరించారు. 2050 తర్వాత వచ్చే 6 వేల ఏండ్లలో వరుస విపత్తులు ఎప్పుడైనా మొదలవ్వొచ్చని వారు వెల్లడించారు. వచ్చే పదిహేనేండ్లలో అట్లాంటిక్ మెరిడినల్ ఓవర్‌టర్నింగ్ సర్క్యులేషన్(ఏఎంఓసీ) వ్యవస్థ పతనమవుతుందని, ఈ పరిణామం జీవావరణ వ్యవస్థ, మానవ సమాజాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్, పాట్స్‌డమ్ వాతావరణ ప్రభావ పరిశోధన సంస్థ పరిశోధకుల బృందం తెలిపింది.

ఏమిటీ ఏఎంఓసీ?

దక్షిణార్ధ గోళంలోని ఉపరితల వెచ్చని నీటిని ఈ వ్యవస్థ ఉత్తర అట్లాంటిక్‌లోని శీతల ప్రాంతాలకు పంపుతుంది. ఉప్పగా, చల్లగా ఉండే ఈ నీరు సముద్ర అడుగు భాగంలో కదులుతూ దక్షిణానికి ప్రవహిస్తుంది. ఇది దక్షిణార్ధ గోళం విపరీతంగా వేడెక్కకుండా, ఉత్తరార్ధ గోళం గడ్డ కట్టకుండా నిరోధిస్తుంది. జీవ శక్తిని ఇచ్చే పోషకాలను సముద్ర పర్యావరణ వ్యవస్థ అంతటా వ్యాపింపచేస్తుంది. అయితే గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారం పెరగడం, మంచు కరగడం వల్ల ఈ వ్యవస్థ బలహీనమైపోతున్నది. పరిశోధకుడు మయా బెన్-యామి మాట్లాడుతూ 'మా పరిశోధన మనకు ఒక మేల్కొలుపు, హెచ్చరిక. ఇప్పటికీ కొన్ని అంశాలను మనం నిరోధించలేం. ప్రశ్నార్థకంగా ఉన్న వ్యవస్థలను అర్థం చేసుకోవడానికి మనం మరింత డాటాను లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది' అని తెలిపారు.